వెళ్ళి మాట్లాడదాం పద గురూ!

విహారి పెద్ద ఉత్సాహం చూపించలేదు. మరీ ముద్దపప్పులా ఉండి బ్రదర్ మొన్న చూశాం కదా అన్నాడు.

అదేం కాదులే నీ మనసు మరోవేపు లాగుతున్నట్లు తోస్తున్నది నాటకీయంగా అన్నాడు. పద్మాకర్ ఓరగా చూస్తూ. ఒకే రోజు పరిచయమైన ఇద్దరమ్మాయిలూ రెండు వేర్వేరు కోణాల్లో అతడికి ప్రతిమల్లా కనబడుతున్నారు.

దూరం నుంచి ఆ అమ్మాయి నిజంగానే లేలేత ఎండలో పోత పోసిన విగ్రహంలా వుంది. విహారి అటే చూస్తూ వుండటం గమనించి పద్మాకర్ ప్రతీవాడు తన ప్రియురాలికి కాసిన్ని తెలివితేటలు చురుకుదనం వుండాలని కోరుకుంటాడు గురూ. కానీ అవి లేకపోవటం డిస్క్వాలిఫికేషన్ కాదు. ఆ మాటకొస్తే సిగ్గే సింగారం అన్నారు పెద్దలు ఇలాంటి వాళ్ళే ఒంటరిగా వున్నప్పుడు తెగ మాటకారులై శృంగారంలో రెచ్చిపోతారు.

విహారి వినలేదు. అతడి ఆలోచనలు ప్రవల్లిక వేపే ఉన్నాయి. సునాదతో పోల్చుకుంటే అంత అందమైనది కాదు. కానీ ఏదో తెలియని ఠీవి హుందాతనం ఆమెలో ఉన్నాయి. అతడి మనసు డోలాయమానమైన స్థితిలో వుంది.

వాళ్ళిద్దరూ చూస్తూ వుండగానే బస్సు రావడం. సునాదమాల వెళ్ళిపోవడం. విష్ణుకి జాగ్రత్తలు చెప్తూ ..... సాధారణంగా ఆమె విష్ణుని ఎక్కించే వరకూ వెళ్ళదు. కాని అదే వీధిలో తెలిసిన ఒకావిడ తన కొడుకుని కూడా స్కూల్ బస్ కోసం తీసుకు రావటంతో కాలేజీకి ఆలస్య మైపోతోందని వెళ్ళిపోయింది.

హాయ్ వినీల్ అన్నాడు విష్ణు.

హల్లో అన్నాడు వినీల్ వాడి కాళ్ళ జోడు క్రొత్తదనాన్ని సూచిస్తుంది. వాళ్ళమ్మ విష్ణుతో సాయంత్రం మా ఇంటికి రా బాబూ. వినీల్ బర్త్ డే అంది.

తప్పకుండా ఆంటీ అని వాడివేపు తిరిగి నిన్న చెప్పలేదేంరా వినీల్ అన్నాడు విష్ణు వాళ్ళ క్లాస్ లీడర్ అందరికన్నా రెండంగుళాలు పొడవు ఎక్కువ వినీల్ వాడికి పూర్తి వ్యతిరేఖం పొట్టి సిగ్గు, క్లాసులో ఫస్టు.

చాక్లెట్లు యిస్తూ ఈరోజు చెపుదామనుకున్నాను అన్నాడు సన్నగా. అంతలో స్కూల్ బస్సు వచ్చింది స్కూల్లో పంచటం కోసం చాక్లెట్ల సంచి పట్టుకుని వినీల్ బస్ ఎక్కడు. వెనుక విష్ణు ఎక్కి రైట్ అన్నాడు ఈ లోపులో విహారి పద్మాకర్ టీ డబ్బులిచ్చేసి కారు దగ్గరకు వచ్చారు.

వినీల్ తల్లి కిటికీ అవతల్నుంచి పార్టీకి రమ్మని విష్ణుకి మరోసారి గుర్తుచేస్తూ వుండగా బస్ కదిలింది. అదే సమయానికి పద్మాకర్ విహారి వున్న కారు బస్ వెనక్కి వచ్చింది. కొంచెం దూరం ప్రయాణం చేశారు బస్ ముందు ఆగడంతో విహారి విసుగ్గా కిటికీలోంచి తల బయటకు పెట్టి చూశారు.

ముందు బస్‌ను ఎవరో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఆపుచేసి లోపలకు ప్రవేశిస్తున్నాడు. విహారి కారు పక్కకు తీసి బస్‌ను దాటి ముందుకు పోనిచ్చాడు.

అతడు గానీ పద్మాకర్ గానీ తల తిప్పి బస్‌లోకి చూసి వుంటే ఈ కథ మరో రకంగా మలుపు తిరిగేది .

బస్‌లోకి బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌లా ప్రవేశించిన వాడు డ్రైవర్ దగ్గరకి వెళ్లగా వాడి అసిస్టెంట్ కండక్టర్ దగ్గర నిలబడ్డాడు. ఇద్దరూ ఎంతో ట్రెయినింగ్ పొందిన ప్రొఫెషనలిస్టుల్లాగా ఒకేసారి డ్రైవరు కండక్టర్‌ల మధ్య దాడి జరిపారు. అరక్షణంలో జరిగిపోయింది. డ్రైవర్‌ని పక్కకి తోసేసి ఒకడు డ్రైవింగ్ సీటులో కుర్చున్నాడు. పిల్లలు చేసే హాహా కారాలు ఆ బస్స్ చప్పుళ్లలో వినపడలేదు. బస్ వేగంగా కదిలి క్షణాల్లో అక్కనుంచి అదృష్యమైంది.

*    *    *

ఒరేయ్ దిగరా కారు సడెన్‌గా ఆపుచేసి విహారి అన్నాడు.

ఇది అన్యాయం గురూ పక్కస్థానాన్ని స్నేహితుడికి ఇచ్చే వాడే నిజమయిన స్నేహితుడు అన్నావు. ఇప్పుడు అమ్మాయి కనబడగానే కారు దిగమంటున్నావు.

స్నేహితురాలు కనపడే వరకే స్నేహితుడికి పక్క స్థానం  ఆ తర్వాత మూడో స్థానం దూరంగా నడుస్తూ వెళుతున్న ప్రవల్లికను చూస్తూ అన్నాడు విహారి

కరెక్ట్ మూడో స్థానాన్నే ఇవ్వు. అమ్మాయిని మధ్యలో కూర్చోబెట్టుకుందాం.

నోర్ముయ్ దిగుతావా లేదా ..... అని వాడిని బలవంతంగా దింపేసి. ప్రవల్లిక దగరకు స్లోగా నడుపుకుంటూ వెళ్ళి హల్లో అన్నాడు. ఏదో ఆలోచిస్తున్న ఆమె తెప్పరిల్లి హల్లో ..... మీరా అంది

రండి డ్రాప్ చేస్తాను అప్పుడే కనపడినట్లు అన్నాడు.

ఆమె వచ్చి కారులో కూర్చుంది ఇంటికి దారి చెపుతూ.

మీ కారేమయింది ?

కారు లేకుండా వెళ్ళాల్సిన పని ఒకటి తగిలింది అంతకన్నా వివరాలు చెప్పటం ఇష్టం లేనట్లు ఆమె అర్థోక్తిలో ఆపుచేసింది. అది గ్రహించి అతడు మాట మార్చాడు. మొన్న ఆగిపోయిన నాటకం మళ్ళీ ఎల్లుండి వుంది మీరొస్తారా ?

ఆఖరి పోరాటం కదూ

అవును

ఏమిటి థీమ్ ?

తరతరాల బీదరికాన్ని మరింత క్లిష్టం చేస్తూ ఒక బూర్జువా భూకామందు చేసే దురాగత చర్యలకు పీడిత ప్రజానీకం చేస్తే తిరుగుబాటు ఆఖరి పోరాటం ..... ఉత్తేజితుడై చెప్పాడు విహారి.

దానికి మీరు నిర్దేశకులా ? మంత్రిగారి వేషం కూడా వేసినట్లున్నారు.

అవును

ఏం చేస్తూ వుంటారు మీరు?

విహారి వెంటనే జవాబు చెప్పకుండా ఆగిపోయాడు చెప్పటానికి ఏమీలేదు.

మీ తల్లిదండ్రులు బాగా ఆస్థిపరులనుకుంటాను.

నాకు తండ్రిలేడు. తల్లివుంది. మా తాతగారు తరపు ఆస్థి వచ్చింది

తాతగారంటే మా తల్లిగారి తండ్రిగారు చెప్పాడేగాని ఆమె దేనిని గమ్యంగా పెట్టుకుని అడుగుతోందో అర్థమైనట్టు అతడి స్వరములో అదోలాంటి సంధిగ్దత ధ్వనించింది. అతడేమీ తెలివిహీనుడు కాదు అర్థం చేసుకోలేక పోవటానికి.

ఆమె తలతిప్పి అతడి వేపు చూసింది ప్రొద్దున్న పూట ఎండ అతడి మొహం మీద అట్నుంచి పడుతూంది. కొనదేలిన ముక్కు ఎంతో అందంగా సిల్‌హౌంట్‌లో లాగా కనబడుతుంది. అతడు డ్రైవ్ చేస్తూ క్రింద పెదవిని బిగించిన విధానం అదో రకమయిన పట్టుదలని సూచిస్తూంది.

ఆమె అన్నది నాకు నాటకాల గురించి తెలీదు. కాని ప్రైజు వచ్చినప్పుడు లేక ఆ నాటకం బావున్నప్పుడూ ప్రేక్షకులు కొట్టే చప్పట్లు బాగా స్ఫూ ర్తినిస్తాయనుకుంటాను.

అవును ఆ చప్పట్లతో మేము పడిన కష్టమంతా పోయినట్టు అనిపిస్తుంది. అవిగో వినరా చప్పట్లు ఆ చప్పట్లే కదరా ఆకలిగొన్న కళ జీవికి పంచభక్ష్య పరమాన్నాలు అన్నాడొక రచయిత ఉత్సాహంగా చెప్పాడు విహారి. అంత అందమైన అమ్మాయి అంత పెద్ద పొజిషన్‌లో వున్న ఆఫీసర్ తను కృషి చేస్తున్న రంగాన్ని మెచ్చుకోవటం అతడికి చాలా ఉత్సాహాన్నిచ్చింది.

మా నాన్నగారికి రాష్ట్రపతి పరమ వీర చక్ర మెడల్ తగిలిస్తున్నప్పుడు కూడా ఇలాంటి చప్పట్లే అన్నట్లు మీరేం చేస్తూ ఉంటారో చెప్పలేదు. సాయంత్రం పూట సరే ప్రొద్దున్నించి సాయంత్రం వరకూ?

కొంతకాలం ఒక ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా చేసి మానేశాను ఉద్యోగానికి నాకూ సరిపోదనిపించింది.

ఆమె నవ్వి వాళ్ళిచ్చే జీతం మీ ఒకరోజు ఖర్చుకి సరిపోయి వుండదు బహుశా అంది. అది నిజమే కానీ అతడు నవ్వలేదు. బూర్జువాలా మీద పోరాటం అని ఎందుకు అన్నానా అనుకోసాగాడు. అతడి మనసులో ఏ మూలో అతనిపట్ల ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్ ఉండి వుండవచ్చు. ఆమె సంభాషణ అతనిలో లోపలి భావాల్ని భూతద్దంలో చూపిస్తున్నది. అంతర్‌మథనం ఎప్పుడు ప్రారంభం అవుతుందో అప్పుడు అది ఎదుగుదలవేపు దారి తొస్తుంది. దానికి పెద్ద సంఘటనలు కారణాలు అవసరం లేదు. తనని తాను చూసుకోవటానికి ఆమె అద్దంగా కనపడింది. తన ట్రూపులో సగం మందికి పైగా రకరకాల ఆఫీసరుల్లో పని చేస్తున్నారు. దాదాపు అందరూ లంచాలు పడతారు. వేసేది మాత్రం ఆఖరి పోరాటం టైపు నాటకాలు. ఈ సత్యం అతడికి అర్థం కాలేదు అంత తొందరగా జీర్ణం కాదు.

ఏ సినిమా హాల్లోనో బజారులోనో కనపడి అలాంటి అమ్మాయి గురించి పెద్దగా పట్టించుకునే వాడు కాదు కానీ చాలా తక్కువ మాటల్తో ఎక్కువ భావాన్ని స్ఫురించేట్టు ఆమె మట్లాడే మాటలు చివరికి ఆమె కూర్చున్న పొజిషన్‌లో వున్న ఠీవీని అతడిని అదో రకమైన సంభ్రమంలో పడేసినాయి.

అతడు ఉన్నట్టుండి మౌనం వహించటం చూసి తనేమన్నా తప్పుగా మాట్లాడిందేమో అని అనుకుంది కారు వేగంగా పోతూంది.

మీకు జీతమెంత వస్తుంది? ఆలోచనల్లోనే అడిగాడు.

ఆమె నవ్వింది. ఆడవాళ్ళని జీతం అడక్కూడదనలేదు కాబట్టి చెప్పొచ్చు .....టాక్స్ పోను రెండు వేలు.

అంతేనా అనబోయి నోటి చివర వరకూ వచ్చిన మాటని ఆపుకున్నాడు. ఆ మాట బయటకు వచ్చి వుంటే బహుశా జీవితాంతం బాధపడి వుండేవాడేమో ..... రెండువేలు ప్రాణాలకు తెగించి బుల్లెట్స్ మధ్య పరుగెత్తిన వైనం గుర్తొచ్చి. కేవలం రెండువేల జీతం కోసం, స్టార్ హోటల్లో తన ఫ్రెండ్స్‌తో ఒక సాయంత్రానికి అయ్యే ఖర్చు ..... బూర్జువాల మీద ఆఖరి పోరాటం నాటకం సక్సెస్ అయితే తాము స్టార్ హోటల్‌లో పెట్టే ఒక సాయంత్రం ఖర్చు!!

ఎందుకు అడిగారో నా జీతాన్ని? నవ్వుతూనే ప్రశ్నించింది.

మీరేం చెయ్యవలసి వుంటుంది?

క్రిమినల్స్‌ని పట్టుకోవడానికి రకరకాల వేషాలు వెయ్యవలసి వుంటుంది.

మీరు వేశాలు వేస్తారా?

ఏం వెయ్యకూడదా?

డిటెక్టివ్‌లు నవలల్లో మారువేషాలేస్తే చదవటానికి నమ్మటానికీ వీలుగా వుంటుందిగాని ఆడవాళ్ళు ఎంత సి.బి.ఐ వారైనా మారువేషం వేస్తే కనిపెట్టరంటారా నేరస్తులు?

ఫిజికల్ థెరపీ వాయిస్ మాడ్యులేషన్ థెరపీలుంటాయి చాలా సులభంగా మారిపోవచ్చు.

నాకు నమ్మశక్యం కావటం లేదు.

దాని గురించి తీరిగ్గా మాట్లడుకుందాంగానీ ఆ కుడివైపు బిల్డింగ్ లోపలికి తిప్పండి అదే మా ఇల్లు.

కారు మొక్కల మధ్య నుంచి లోపల పోర్టికోలోకి వెళ్ళి ఆగింది.

రండి టీ తాగి వెళుదురుగాని.

రెండోసారి అడిగే అవసరం లేకుండానే అతడు దిగాడు. ఆమెలో ఏదో అకర్షణ అతడిని పరిమళంలా చుట్టుముడుతోంది. అది ప్రేమ కాదు ..... ప్రేమ గుడ్డిది. ఆమె సామీప్యంలో అతడి మనోనేత్రాలు తెరుచుకోవటం ప్రారంభించాయి. లేదా అది గౌరవమా? కాదు ఆమె అతని కంటె చిన్నది. నాజూకైనది భక్తా? కాదు ..... ఉహూ ..... అయి యుండవచ్చు అయితే అది

చేయాలి.

వాళ్ళిద్దరూ లోపలికి వెళుతుండగా ఒక వృద్ధుడు లోపలినుండి వచ్చాడు.

మా తండ్రిగారు ..... పరిచయం చేసింది ఆమె అతడు నిశ్చేష్ఠుడై చూశాడు చక్రాల కుర్చీలో ముందుకు వస్తూ చేయి చాచిన వ్యక్తుకి రెండు కాళ్ళు లేవు.

గ్లాడ్ టు మీట్‌యు ప్రతాపరావు చేయి అందించాడు.

కూర్చోండి ఇప్పుడే వస్తాను అంటూ అమె లోపలికి వెళ్ళింది కొంచెంసేపు ఆయన అతడితో మాట్లాడాడు. ఏంచేస్తూ వుంటారు మీరు? అని ఆయన అడిగిన ప్రశ్న అతడిని ఇబ్బందిలో పడేసింది. ఇంతకు ముందు అలా వుండేది కాదు. మాట తప్పించటం కోసం యుద్ధంలో పోయాయా మీ కాళ్ళు అని అడిగాడు.

లేదు వ్య క్తిగతమయిన గొడవల్లో మిగతా వివరాలు చెప్పటానికి ఇష్టం లేనట్లు అమ్మాయి వస్తోంది నేనలా గార్డెన్‌కి వెళ్ళొస్తాను అంటూ కుర్చీ తోసుకుంటూ వెళ్ళిపోయాడాయన. విహారి ఒక్కడే గదిలో మిగిలాడు.

అప్పుడు గమనించాడు ఆ హాల్లో ప్రత్యేకతని.

గదిలో భగవంతుడి ఫోటోలు కానీ దేవుడి బొమ్మలుగానీ లేవు. ఒకవైపు గోడని నిలువెత్తు భారతదేశపు పటం వుండి, మధ్యలో జెండ మరోవైపు భరతమాత ఫోటో ..... మిగతా దేశ నాయకుల పటాలు.

అతడికి ఏమీ తోచలేదు వంటమనిషి టీ తీసుకొచ్చి ఇచ్చాడు. అది తాగుతూ బల్లమీద వున్న టేపు రికార్డర్ ఆన్ చేశాడు. ..... సారే జహాసే అచ్చా హిందుస్తా హమరా పాట వచ్చింది. అది మార్చి ప్రక్కనే వున్న మరో క్యాసెట్ పెట్టాడు. ఇది నా భారతదేశం ..... సర్వజనావళికిది శుభ సందేశం .....

మా ఇంటిలో మీకు మామూలు పాటలు వినపడవు ఒక మొగ గొంతు వినపడటంతో తలతిప్పి చూశాడు. ఒక పొడవాటి వ్య క్తి లోపలి నుంచి వస్తూ అంటున్నాడు ఆ మటలు. విహారి తనవైపు ప్రశ్నార్థకంగా చూడటం గమనించి నా పేరు ప్రశాంత్ మీ స్నేహితురాలు ప్రవల్లికకి కాబోయే భర్తని చేయి సాచుతూ అన్నాడు.

అది లక్ష వోల్టుల షాకు కాదు. సన్నటి జలదరింపు విచారాన్ని మోసుకొచ్చే ప్రళయకల ఝుంఝూమారుతాం కాదు. ఒంటరితనాన్ని పలుకరించే పిల్లగాలి అతడు అన్యమనస్కంగానే ప్రశాంత్‌తో మాట్లాడాడు.

తను వస్తుండడం కూర్చోండి నాకు పనుంది వెళ్ళొస్తాను అంటూ అతడు వెళ్ళిన కొద్దిసేపటికి ప్రవళ్ళిక రెండు కప్పుల టీతో రావడం. ఈసారి ఆమె నిండు చీరెలో విచ్చిన గులాబిలా వుంది. కారులో ఎక్కినప్పుడున్న మాక్సీలేదు. ఏమిటి మా బావ మిమ్మల్ని బోర్ కొట్టినట్టున్నాడు.

అటువంటిదేమీ లేదు.